**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి


## భద్రాచలం ప్రభుత్వ దవాఖాన వద్ద ఉద్రిక్తత

**భద్రాచలం, మార్చి28**

భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కుల సంఘాలు, వామపక్ష, కుల సంఘా నాయకులు, తాపీమేస్త్రి ఉపేందర్ బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వ దవాఖాన మార్చురీ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం బుధవారం కూలిన ఘటన విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే.


సంపుటి : 1 | సంచిక : 242 | శనివారం 29-03-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


# భావస్వేచ్ఛను గౌరవించాలి

**- అది ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది - సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,మార్చి28:** కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో ' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది. ఉదారవాద, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కులైన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ప్రతి విమర్శ లేదా అసమ్మతిని తమ అధికారం మరియు స్థానానికి ముప్పుగా భావించే అభద్రతా భావంతో బలహీనం చేయకూడదని జస్టిస్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు సహేతుకంగానే ఉండాలని జస్టిస్ భుయాన్ వివరించారు. ఆంక్షలు హానికరం లేదా అణచివేతగా ఉండకూడదని, స్వేచ్ఛగా మాట్లాడే ప్రాథమిక హక్కుని ఆంక్షలు కప్పివేయలేవని జస్టిస్ భుయాన్ సూటిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాక్, భావ ప్రకటనా హక్కుని కాపాడటం , గౌరవించడం పోలీసుల, ప్రభుత్వాల భాధ్యత అని ధర్మాసనం ఉద్ఘాటించింది. కవిత్వం, నాటకం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు, వ్యంగ్యం, కళలు సహా సాహిత్యం జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తుందని, వ్యక్తులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కులను గౌరవించాలని జస్టిస్ ఓకా పునరుద్ఘాటించారు. ఆరోగ్యకరమైన ,నాగరిక సమాజంలో వాక్ స్వాతంత్ర్యం అంతర్భాగమని, మెజారిటీ- వ్యక్తులు అభిమానిస్తున్నారనే కారణంతో ఒక వ్యక్తి అభిప్రాయాలను అణచివేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది.

పోలీసులు కూడా భిన్నాభిప్రాయాలను కాపాడాలని, అవి కూడా ప్రజాస్వామ్య విధుల్లో ఒక భాగమని కోర్టు పేర్కొంది. ఆలోచనా స్వేచ్ఛ లేకుండా భావప్రకటన లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హామీ ఇచ్చిన గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. పోలీసులు మరియు ప్రభుత్వం వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడటంలో విఫలమైతే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయకుండా చూసుకోవడం కోర్టుల విధి అని పేర్కొన్నారు. కులం మతం ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య శతృత్వాన్ని పెంచుతున్నారని ఆరోపిస్తూ గుజరాత్ పోలీసులు ప్రతాప్‌గర్హిపై కేసు నమోదు చేశారు. మార్చి 3 విచారణ సమయంలో ఈ కవిత అహింసను సూచిస్తుందని మహాత్మాగాంధీ స్వయంగా అనుసరించిన మార్గమని మార్చి 3న జరిగిన విచారణలో జస్టిస్ ఓకా పేర్కొన్న సంగతి తెలిసిందే.

# సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం అవివేకం

**- ఇది ప్రకృతి విధ్వంసకర చర్య మాత్రమే - ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,మార్చి28:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తూ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్య చేశారు. కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాదు, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. అయితే, విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు, 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబడుతూ, ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు




**నాగర్ కర్నూల్,మార్చి28:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు ష్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

# అర్హులందరికీ కార్డులు..సన్నబియ్యం

**మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి**



**నల్లగొండ,మార్చి28:** అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. అందుకే సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ. 10,665 కోట్లు- ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

# మయన్మార్‌లో మృత్యుఘోష..

## భారీ భుకంపంలో 144 మంది మృతి




నైఫిడో: మయన్మార్ శుక్రవారంనాడు భారీ కంపాలతో చిగురులాటుగా వణికిపోయింది. 12 సెకెండ్ల వ్యవధిలో రెండు భారీ భూకంపాలు సంభవించడంతో అపార జననష్టం సంభవించింది. 144 మంది మృత్యువాత పడగా, 730 మందికి పైగా గాయపడినట్టు మయన్మార్ మిలటరీ ప్రభుత్వం ప్రకటించింది. భవనాల శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు జరుగుతుండంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. లెక్కకు మిక్కిలిగా భవనాలు నేలమట్టం కావడం, ఆకాశహర్మ్యాలు, వంతెనలు కుప్పకూలినట్టు ఫోటోలు, వీడియోలు వెలుగుచూస్తుండగా నష్టం పెద్దఎత్తునే జరిగి ఉండవచ్చనే కథనాలు వెలువడుతున్నాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.7గా నమోదు కాగా, మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలే సమీపంలో భూకంప నమోదు కేంద్రాన్ని గుర్తించారు. తొలి భూకంపం సంభవించిన సెకన్లలోనే 6.4 తీవ్రతతో మరో భూకంపం సంభవించడంతో మరింత తీవ్రనష్టం జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. మాండలేలోని రోడ్లు భారీ ఎత్తున పగుళ్లు తీయడం, హైవేలు తీవ్రంగా దెబ్బతినడం, వంతెనలు కుప్పకూలడంతో రెస్క్యూ ఆపరేషన్లకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భూకంప తాకిడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో క్షతగ్రాతుల తక్షణ చికిత్స కోసం అవసరమైన బ్లడ్‌కు తీవ్ర కొరత ఏర్పడిందంటూ వార్తలు వస్తున్నాయి. తొలుత మయన్మార్‌లో భూకంప తీవ్రతగా 20 మంది వరకూ మృతి చెందినట్టు మీడియా కథనాలు వచ్చినప్పటికీ అనేక భవనాలు ఊగిపోవడం, క్షణాల్లో కుప్పకూలడంతో జనం భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. నిర్మాణంలో ఉన్న 33 అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలిపోవడంతో కార్మికులు పరుగులు పెట్టారు. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయిట్టు కథనాలు వచ్చాయి. మయన్మార్, థాయ్‌లాండ్‌లో భారీ భూకంపంపై భారత్ వెంటనే స్పందించింది. రెండు దేశాలకు అవసరమని సాయం అందజేస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ప్రతి ఒక్కరి భద్రత సంక్షేమ కోసం ప్రార్థిస్తున్నట్టు మోదీ ట్వీట్ చేశారు. అన్ని విధాలా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉండాలని అధికారులను కోరినట్టు ఆయన పేర్కొన్నారు. మయన్మార్, థాయిలాండ్ ప్రభత్వాలతో సంప్రదింపులు జరపాల్సిందిగా విదేశాంగ శాఖను కోరామని తెలిపారు. థాయ్‌లాండ్‌లోనూ భూకంపంతో 8 మంది మరణించినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. కాగా, థాయ్‌లాండ్‌లోని భారత ఎంబసీ హెల్త్‌లైన్ ఏర్పాటు చేసింది. ०66 618819218 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కోరింది.

# కేంద్ర ఉద్యోగులకు శుభవార్త

**డీఏ 2% పెంపు పెన్షనర్లకు డీఆర్ కూడా.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం**

**ఖరీఫ్‌లో ఫాస్పేట్, పొటాష్ ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ**

**నాన్-సెమీకండక్టర్ పరికరాల కోసం 22,919 కోట్లతో పీఎల్ఐ స్కీం**




**న్యూఢిల్లీ, మార్చి 28:** కేంద్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు శుభవార్త ప్రకటించింది. వారికి కరువు భత్యం (డీఏ), డిఎఫ్‌లను రెండు శాతం పెంచే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ దీనితో పాటు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని రైల్వే, సమాచార,ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్ల మౌలిక వేతనం/పింఛనులో డీఏ, డీఆర్ 53 శాతంగా ఉన్నాయని.. ఇప్పుడవి 55 శాతానికి పెరిగినట్లు చెప్పారు. ఏడో వేతన సంఘం సిఫారసుల ఆధారంగా.. ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి పెంపు అమల్లోకి వస్తుంది. దీనివల్ల 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 66.55 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని తెలిపారు. ఎనిమిదో వేతన కమిషన్ ఏర్పాటుకోసం ఎదురుచూస్తున్న వీరికి ఇప్పుడు వేతనాలు, పెన్షన్లు పెరుగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ పెంపు కారణంగా కేంద్ర ఖజానాపై ఏటా రూ. 6,614.04 కోట్ల భారం పడుతుందని మంత్రి చెప్పారు. కాగా.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై రూ. 37,216 కోట్ల సబ్సిడీ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. డీఏపీ ఎరువుల ప్రస్తుత రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయి. రూ. 22,919 కోట్లతో నాన్-సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలకు ఉత్పాదక ఆధారిత రాయితీ (పీఎల్ఐ) స్కీంను కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఈ పరిశ్రమ ఎంతకాలంగానో ఈ నిర్ణయం కోసం ఎదురుచూస్తోందని, ఈ ప్యాకేజీ ఆరేళ్లు అమల్లో ఉంటుందని వైష్ణవ్ చెప్పారు.

# కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

**పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని : ఎమ్మెల్సీ కవిత**

**హైదరాబాద్, మార్చి28:** కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ. 4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ. 8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు.

# తల్లి కలను నెరవేర్చేందుకు కూతుళ్ల అండ



**అల్లూరి జిల్లా, చింతపల్లి, తొవ్వ ప్రతినిధి, ( ప్రశాంత్ ) మార్చి 28:**
చింతపల్లి కేంద్రీయ ఆశ్రమోన్నత పాఠశాలలో పదవ తరగతి సార్వత్రిక పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో ఓ తల్లి తన చివరి సోషల్ ఎగ్జామ్ రాస్తుండగా, ఆమె కూతుళ్లు ప్రత్యేకంగా పరీక్షా కేంద్రానికి వచ్చి తమ మాతృదేవికి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ బాధ్యతల నడుమ చదువును ఆపేసిన ఓ తల్లిఏళ్ల తర్వాత తన లక్ష్యాన్ని చేరుకునేందుకు మళ్లీ పుస్తకాలను చేతబట్టింది. ఇప్పుడు ఆమె పదవ తరగతి చివరి పరీక్ష రాస్తోంది. ఈ ప్రత్యేక ఘట్టంలో, ఆమె కూతుళ్లు పరీక్షా కేంద్రానికి వచ్చి తల్లికి శుభాకాంక్షలు తెలుపుతూ మద్దతుగా నిలిచారు. తల్లి తన కలను నెరవేర్చేందుకు వేసిన ప్రతి అడుగుకూ, కూతుళ్లు అండగా నిలుస్తున్న ఈ దృశ్యం అందరి హృదయాన్ని హత్తుకునేలా ఉంది. పరీక్షా హాల్ వరకు తల్లిని తీసుకొచ్చి, ఆత్మవిశ్వాసం నింపి, చిన్నగా కానుకలు అందజేస్తూ "అమ్మా, నీ విజయం మా గర్వకారణం" అంటూ వారు పలికిన మాటలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరిని ఉప్పొంగేలా చేశాయి. విద్యకు వయస్సు అడ్డంకి కాదని, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని ఈ తల్లి మరోసారి నిరూపించింది. కూతుళ్లు తల్లి కలను గౌరవించి, ఆమె లక్ష్య సాధనకు మద్దతుగా నిలిచిన తీరు, ప్రతి తల్లికీ, ప్రతి పిల్లకూ స్ఫూర్తినిచ్చేలా ఉంది. ఈ తల్లి విజయాన్ని అందరూ ఆకాంక్షిస్తూ, "మీ లక్ష్యం నెరవేరాలి... మీ తపన ఫలించాలి!" అని ఆశీస్సులు అందిస్తున్నారు. ఈ సంఘటన కుటుంబ మద్దతు ఉంటే ఏదైనా వి అనడంలో సందేహం లేదు.

# స్వచ్ఛంద సేవా సంఘాల సహకారంతో చేతిపంపు బోర్లు ఏర్పాటు



**అల్లూరి జిల్లా, చింతపల్లి తొవ్వ ప్రతినిధి,( ప్రశాంత్ ) మార్చి 28:**
ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ ఆర్గనైజేషన్ ఆర్థిక సహాయంతో చింతపల్లి సాయి నగర్కు చెందిన యువజీవన సేవ సంఘం ఆధ్వర్యంలో చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని మల్లవరం, పెదబరడ పంచాయతీ చినబరడ గ్రామాలలో చేతిపంపు బోర్లను ఏర్పాటు చేయడం జరిగిందని యువ జీవన సేవా సంఘం అధ్యక్షుడు కదుల్ల మధుసూదనరావు అన్నారు. శుక్రవారం ఆయా గ్రామాలలో స్థానిక గ్రామస్తులతో కలిసి తాగునీటి చేతిపంపు బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువజీవన సేవా సంఘం అధ్యక్షుడు మధుసూదనరావు మాట్లాడుతూ, గ్రామ ప్రజల దైనందిన అవసరాల కోసం నీటి వనరులను అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని, ఈ కార్యక్రమం ద్వారా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామాలలో తమ వంతుగా ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ ఆర్గనైజేషన్ బృందం యొక్క ఆర్థిక సహాయంతో తాగునీటి చేతిపంపు బోర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవిలో త్రాగునీటికి అనేక గ్రామాలు ఇబ్బందులు పడుతున్నాయని ఇది గమనించిన తమ సేవా సంఘం, ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ ఆర్గనైజేషన్ సహాయంతో అవసరమైన గ్రామాలకు తాగునీటి బోర్లను నిర్మించేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. ప్రజలు ఈ చేతిపంపు బోర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు తమను సంప్రదించినట్లయితే ఆ గ్రామాలకు చేతిపంపు బోర్ల నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గ్రామాలలో చేతి పంపు బోర్లు నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ ఆర్గనైజేషన్ బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త బోర్ల ఏర్పాటు వల్ల తమ గ్రామాలకు తాగునీటి సమస్య కొంతమేర తీరిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేస్తూ, యువజీవన సేవా సంఘం, ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి -బయ్యారం ఎంపీటీసీ 1 బరిలో నేనున్నా

## -నీలారపు సంపత్ యాదవ్



**తోవ్వ, బయ్యారం,మార్చ్ 28.**
స్థానిక సంస్థల ఎన్నికల పై గ్రామ యువత ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో సమస్యలపై ప్రశ్నించే గొంతుకలుగా మారుతున్నారు.కష్టపడి ఇష్టపడి పని చేస్తే అసాధ్యం అనేది లేదు కష్టించి పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలనే తపనతో రాజకీయల్లోకి రావాలని అనుకుంటున్నా,పార్టీ ఆదేశిస్తే పార్టీ తరపున లేదంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా అయినా ఎంపిటిసి అభ్యర్థి గా నిలబడాలని ఉంది. బయ్యారం మండల కేంద్రానికి చెందిన నీలారపు సంపత్ యాదవ్ తమ మనసులో మాటను శుక్రవారం మీడియాకు తెలిపారు. నిత్యం తమ కుటుంబం వ్యవసాయం పైన ఆధారపడి పనిచేస్తుందని, నేటి రాజకీయాల్లో ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రధానంగా డబ్బునే నమ్ముకోవాల్సి వస్తుందని వ్యక్తిత్వం మీద నమ్మకం లేకుండా కొంతమంది డబ్బును నమ్ముకుని రాజకీయాలను శాసిస్తున్నారని దానికి చెక్ పెట్టాలనే తపనతోనే బయ్యారం వన్ ఎంపీటీసీగా బరిలో నిలవదలుచుకున్నానని తెలిపారు.నా దగ్గర డబ్బుతోనో ఓట్లు కొనే స్తోమత నాకు లేదు.సమాజానికి మంచి సేవా చెయ్యాలనే దృక్పథంతో మీ ముందుకు వస్తున్నానని రాబోయే స్థానిక సంస్థల ఎంపీటీసీ బరిలో నన్ను ప్రజలు ఆదరించాలని కోరారు.బయ్యారం మండల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని తనను ఒక్కసారి ఆదరించాలని కోరారు.ఈ సారి జరగబోయే..స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీ.ఆర్.ఎస్,బీజేపీ ప్రధాన రాజకీయ పార్టీల్లో యువతకు ఏ పార్టీ అవకాశం కల్పిస్తుంది..అనేది ఆసక్తిగా మారింది.

# పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై బయ్యారంలో పాస్టర్ల నిరసన

**తోవ్వ, బయ్యారం,మార్చ్ 28.**




బయ్యారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద క్రైస్తవ నాయకులు,పాస్టర్లు, మానవతా వాదులంతా కలిసి పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై అనుమానాలు వ్యక్తం చేస్తు నిరసన కార్యక్రమం చేపట్టారు.ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సాంఘిక దురాచారాలను ఖండిస్తూ,అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టి,అనాథ పిల్లలను ఆదుకుంటున్న పాస్టర్ ప్రవీణ్ ఏ తప్పు చేయకపోయినా రాజమండ్రి వద్ద అనుమానాస్పదంగా మృతి చెందడం తమను తీవ్రంగా బాధించిందని,దీనిని మానవతావాదులంతా తీవ్రంగా ఖండించాలని,ఏపి ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపి,నిజానిజాలు గుర్తించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పాస్టర్ల మండల నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు భూక్య పాండు,కార్యదర్శి జాటోత్ హత్తిరాం, ట్రెజరర్ రవిబాబు,కమిటీ అడ్వైజరి మెంబర్స్ దేవదాస్, జీవ ప్రకాష్, డేవిడ్, యోహాన్,నోమేష్, నవీన్, జాన్ పాల్, సొలోమోన్, ఆనంద్ కుమార్, జీవన్, దానియేలు, మోషే, ప్రభాకర్, సత్యరాజ్, యోసేపు,ఇతర క్రైస్తవ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఈ నియోజకవర్గంలో రైతులందరికీ రుణ మాఫీ చేయాలి

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేసిన భాజపా నేతలు



తొవ్వ ,మంచాల,మార్చ్ 27:ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో రైతులకు రుణమాఫీ చేయాలనీ అన్ని గ్రామాల రైతులు 2 లక్షల రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారనిభారతీయ జనతా పార్టీ బీజేపీ జిల్లా నాయకులు మెండు వెంకట్ రెడ్డీ అన్నారు , శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్లరెడ్డి రంగారెడ్డి ని కలిసి రైతుల పక్షాన వినస్తీ పత్రం అందించారు , ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు 2 లక్షల రుణమాఫీ అందరికి అందించాలని అలాగే సొసైటీ బ్యాంక్ లో నూతంగా భూమి కొనుగోలు చేసుకున్న. లేదా వారసత్వంగా భూమి పొందిన నూతన రైతులకు పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా నాయకులు మెండు వెంకట్ రెడ్డీ మంచాల మండల ప్రెసిడెంట్ నూకం రాజు ముదిరాజ్ మాజీ వార్డ్ సభ్యులు మంద మోహన్ రెడ్డి బూత్ ప్రెసిడింట్ వేదిరే రవి రెడ్డి ఆచన రవి సోషల్ మీడియా ప్రెసిడెంట్ ప్రసాద్ కార్యకర్తలు పలుకొన్నారు

# ఇబ్రహీం పట్నం అభివృద్దే నా లక్ష్యం

**47 లక్షలతో కూరగాయల మార్కెట్ శంకుస్థాపన**

**పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన "మల్ రెడ్డి రంగా రెడ్డి**

**ఆరుట్ల సొసైటీ ఏర్పాటుకు హామీ**



**తొవ్వ ,మంచాల ,మార్చ్ 28:**
ఇబ్రహీంపట్నం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల సొసైటీ బ్యాంక్ లో రైతులకు 47 లక్షల తో కూరగాయల మార్కెట్ కు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా రైతులకు రుణ మాఫీ అందరికి అందేలా చుస్తామని , రాజీవ్ యువ వికాసం పథకం యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు . అదేవిధంగా గతంలో సొసైటీ గా వున్నా ఆరుట్ల సొసైటీ మంచాల సొసైటీలో విలీనం జరిగిన్నదని తిరిగి ఆరుట్ల సొసైటీ ఏర్పాటు చేయడానికి ఆరుట్ల గ్రామ ప్రజలు గత సభ్యులు విజ్ఞప్తి చేయడం తో ఆరుట్ల సొసైటీ ఏర్పాటుకు హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమాలో మండల సొసైటీ చైర్మన్ హనుమంత రెడ్డి సొసైటీ నెంబర్ ఎల్లేష్ ఆరుట్ల మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి మా ర్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి ఎమ్మార్వో వివిధ అధికారులు పాల్గొన్నారు

# అస్వస్థతకు గురైన తెదేపా మండల అధ్యక్షుడు మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావును ఆసుపత్రిలో పరామర్శించిన పార్టీ నాయకులు



**అల్లూరి జిల్లా చింతపల్లి. తొవ్వ ప్రతినిధి ( ప్రశాంత్ ) : మార్చి 28 :**
స్థానిక తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఆ పార్టీ పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి చింతపల్లి వచ్చిన సందర్భంలో అప్పటికే అస్వస్థతతో బాధపడుతూ నీరసంగా ఉన్న ఆయన స్థానిక ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం ఆయనకు టైఫాయిడ్ తో పాటు మలేరియా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు ఆయనకు ఇంజక్షన్లతోపాటు సెలైన్ బాటిల్ పెట్టి చికిత్స అందించడంతో కొంత ఉపశమనం పొందారు. మండల అధ్యక్షుడు అస్వస్థతకు గురయ్యారన్న విషయాన్ని తెలుసుకున్న పార్టీ నాయకులు కొంతమంది ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగుల సత్యనారాయణ, గోసరెడ్డి సోమేశ్, షేక్ ఖాసిం వల్లి, చిందాడ అప్పారావు (చిన్న), రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల విషయంలో కేంద్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ చింతపల్లి**

**మజీద్ ఏ క్యూబా లో నిరసన తెలుపుతున్న ముస్లింలు**



**అల్లూరి జిల్లా చింతపల్లి. తొవ్వ ప్రతినిధి ( ప్రశాంత్ ) మార్చి 28 :**
వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ చింతపల్లిలో మజీద్ ఏ క్యూబా లో శుక్రవారం ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మజీద్ అధ్యక్షులు షేక్ మీరా సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు 2024 ను నిరసిస్తూ ఆలిండియా పర్సనల్ లా బోర్డ్ పిలుపుమేరకు స్థానిక ముస్లింలు శుక్రవారం నిరసన గళం వినిపించారు. స్వాతంత్రం సిద్ధించిన నాటి నుంచి వక్ఫ్ బోర్డు పేరిట ఉన్న ఆస్తులను కేంద్ర ప్రభుత్వం సవరించే దిశగా ఆలోచన చేయడం, దానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలిపేందుకు ప్రయత్నిస్తుండడాన్ని ముస్లింలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గురువారం ముస్లింలకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందును బహిష్కరించిన విషయం తెలిసిందే. అదే క్రమంలో శుక్రవారం ప్రతి ముస్లిం నల్ల బ్యాడ్జీలు ధరించి జుమ్మా నమాజుకు హాజరుకావాలని మత పెద్దలు పిలుపునిచ్చిన నేపథ్యంలో చింతపల్లి లోను ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక మజీద్ లో జుమ్మా నమాజ్ ఆచరించారు. ఈ సమస్యపై నేడు (29న) విజయవాడలో ముస్లిం లంతా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ బోర్డు పేరిట ఉన్న ఆస్తులను సవరించి తమకు అన్యాయం చేయడాన్ని ముస్లింలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

# కెమికల్స్‌తో మెహెందీ

**తొవ్వ : 28 మార్చి ,ఎల్బీనగర్ ప్రతినిధి**



హైదరాబాద్ టప్పాచబుత్రలో నకిలీ మెహెందీ తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు. వివరాల్లోకి వెళితే,కెమికల్స్ కలిపి మెహెందీ తయారు చేస్తున్న కొంతమంది నిందితులు.నకిలీ మెహెందీతో కాళ్లు, చేతులు, చర్మం కాలిపోతాయని ఆరోపణలు ఉన్నాయి.భారీగా నకిలీ మెహెందీని స్వాధీనం చేసుకున్న పోలీసులు. పెళ్లిళ్ల సీజన్ కాబట్టి హైదరాబాద్లో జోరుగా నకిలీ మెహందీ మార్కెట్లో చెలామణి చేస్తున్నారు. ఇవి వాడటం వల్ల చర్మ సంబంధ వ్యాధులు మరియు

# అనారోగ్య సమస్యలు వస్తాయంటున్న వైద్యులు

**తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ యజమానుల ఆందోళన**




**తొవ్వ : 28 మార్చి ,ఎల్బీనగర్ ప్రతినిధి**
పర్మిట్ రూమ్‌ల వల్ల నష్టపోతున్నాం అనితెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అబ్కారీ శాఖ కార్యాలయం ముందు నిరసనకు దిగారు పూర్తి వివరాల్లోకి వెళితేబార్ల చుట్టూ ఉన్న వైన్ షాపుల్లో పర్మిట్ రూమ్‌లు ఉండటం వల్ల కస్టమర్లు బార్‌లకు రావడం తగ్గిపోయింది.బార్ల వ్యాపారాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది, కొందరు యజమానులు బార్లు మూసివేయాల్సిన పరిస్థితిలో ఉన్నారు.గ్రామాలు, బస్తీల్లో బెల్ట్ షాపుల సంఖ్య పెరగడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.జిల్లాల్లో వైన్ షాపులు ఉదయం 10:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు మాత్రమే పనిచేస్తుండగా, హైదరాబాద్ మరియు %+ఎవీజ% పరిధిలో రాత్రి 11:00 గంటల వరకు అనుమతించడంపై అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది.%+ఎవీజ% పరిధిలోనూ జిల్లాల్లాగే సమయ పరిమితిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.బార్‌ల ఆదాయం తగ్గిపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం జరుగుతోందని బార్ యజమానులు తెలిపారు.తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# భర్త వేధింపులు తట్టుకోలేక పెళ్లైన 4 నెలలకే యువతి ఆత్మహత్య

**తొవ్వ : 28 మార్చి ,ఎల్బీనగర్ ప్రతినిధి**



వివరాల్లోకి వెళితే ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భోలక్ పూర్ లో భర్త, అత్తింటి వేధింపులు తాళలేక ఓ నవ వధువు పుట్టింటికి వచ్చి మూడంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది.భోలక్ పూర్ కు చెందిన సౌజన్యకు మూసాపేటకు చెందిన జిమ్ నిర్వాకుడు శబరిష్ యాదవ్ తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది.పెళ్లి సమయంలో సౌజన్యకు గుండెలో రంధ్రం ఉందని చెప్పకుండా పెళ్లి చేశారని. ఈ విషయం చెప్పనందుకు అదనపు కట్నం, బంగారం తీసుకురావాలని భర్త, అత్తింటి వాళ్లు వేధింపులకు గురి చేశారు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్న పోలీసులు.

# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి చుక్కెదురు





**తొవ్వ : 28 మార్చి ,ఎల్బీనగర్ ప్రతినిధి**
హైకోర్టులో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి దక్కని ఊరట.కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో హైకోర్టును ఆశ్రయించిన సుధీర్ రెడ్డి.కేసును కొట్టి వేయాలని, అరెస్టు చేయొద్దని చేసిన అభ్యర్థనపై దక్కని ఊరట.పది రోజులపాటు విచారణను వాయిదా వేసిన కోర్టు. కౌంటర్ దాఖలు చేయాలని సుజాత నాయక్‌ను ఆదేశించిన హైకోర్టు.

# ఘనంగా గాదె రాజు జాతర

**కుర్మ అవతారంలో దర్శనం**

**జాతర సందర్భంగా క్రీడా పోటీలు .స్వామి పై పాట ఆవిష్కరణ**



**తొవ్వ కొత్తగూడ మార్చ్ 28:**
కోరిన కోరికలు తీరుస్తూ ఆదివాసి ప్రజలకు రక్షణగా వందల సంవత్సరాల నుండి గ్రామాన్ని కాపాడుతూ ఉన్న కల్తి వారి ఇలవేల్పు గాదరాజు మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం లోని కామారం గ్రామంలో కూర్మావతారంలో కొలువై ఉన్నాడు. స్వామిని దర్శించుకున్న భక్తులకు సంతాన ప్రాప్తి కలిగిస్తూ ప్రజలను ఎల్లవేళలా కాపాడుకుంటూ కోరికలు తీరుస్తున్న గాదరాజు కూర్మ అవతారంలో కొలువై భక్తుల కోరికలు తీరుస్తున్న గాదరాజు పండుగ కల్తీ వారు ఘనంగా నిర్వహించారు. క్రీడా ప్రోటీలను సైతం నిర్వహించడం జరిగింది.గాదరాజు స్వామిపై ప్రత్యేక పాట రూపొందించి ఆవిష్కరించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఈ జాతర లో కల్తీ వంశస్థులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక నిధులు ఇస్తామని అన్నారని తెలిపారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జాతరను విజయవంతం చేశారు

# ఎండిన పంటలకు నష్టపరిహారం ఎకరాకు రూ . 25 వేలు ఇవ్వాలి: సిపిఐ




**యాదాద్రి జిల్లా :వలిగొండ: తోవ్వ ప్రతినిధి : మార్చి 28**
వలిగొండ మండలంలోని దుప్పల్లి గ్రామంలో శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో రైతులు ఎంతో కష్టపడి పంట చేతికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు అని అన్నారు. వెంటనే రైతులను గుర్తించి ఎండిన పంట పొలాలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్లంకి మహేష్, శాఖ కార్యదర్శి కట్ల యాదగిరి, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అంబటి అంజయ్య ,నరిగె యాదయ్య, మారోజు నరసింహ చారి, కన్న మైన పృథ్వీరాజ్, ఎర్ర కిరణ్ , మెట్టు లక్ష్మీనారాయణ, బలగొని రాజు, ఎర్ర వినయ్, తదితరులు పాల్గొన్నారు

## రామన్నపేట మండల ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేదాకా సిపిఎం పోరాటం ఆపదు

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మార్చి 28

రామన్నపేట మండలం ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సిపిఎం పోరాటం ఆపదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు.మండల సమగ్రాభివృద్ధి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆరు రోజులు, 24గ్రామాల్లో నిర్వహించిన సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్ర ముగింపు సందర్భంగా శుక్రవారం వచ్చిన ప్రజా సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాలో మండల వ్యాప్తంగా ప్రజలు, సిపిఎం శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ రామన్నపేట పాత నియోజకవర్గంగా, పాత తాలూకాగా వెలసిల్లి ఇప్పుడు మండలంగా మాత్రమే ఉండి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నది.నూతనంగా ఏర్పాటయ్యే నియోజకవర్గాల పునఃవిభజనలో రామన్నపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి. శిదిలావవస్థకు చేరిన ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలుగా మారుస్తామని దశబ్ద కాలంగా ప్రభుత్వం చెబుతూ కాలమెల్లదీస్తుంది. కనీస సౌకర్యాలు లేవు వెంటనే నూతన భవనం నిర్మించి మెరుగైన వైద్యం అందించాలి.రెండు దశబ్దాలు గడుస్తున్నా పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువలు పూర్తి కావడంలేదు రైతులకు నీరందడంలేదువెంటనే పూర్తి చేయాలి. ఇప్పటికీ మండలంలో ఏ గ్రామానికీ కనీసం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ఇలా అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నవి. వీటితో పాటు గ్రామాల్లో పేరుకుపోయిన అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేసేందుకు చొరవ చూపాలి. లేని పక్షంలో రామన్నపేట మండల ప్రజలను గ్రామాల నుండి వేలాదిమందిని సమీకరించి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సిరిపురం గ్రామంలో సిపిఎం పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి అమలు చేయడంలో విఫలమవుతుంది. అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతాంగా సంక్షేమ పథకాలు అందించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ధర్నా లాల్ బహదూర్ కు పాదయాత్రలో వచ్చిన సమస్యల వినతి పత్రాలను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి యండి. జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, పాదయాత్ర సారధి జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, గన్నేబోయిన విజయభాస్కర్, బొడిగే రజిత, వేముల సైదులు, మేడి గణేష్, కొమ్ము అంజమ్మ, శానగొండ రాము, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గురి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి నగేష్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి, మాజీ వైస్ యంపిపి నాగటి ఉపేందర్, నీల ఐలయ్య, సిరిపురం శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

యాదాద్రి జిల్లా :వలిగొండ: తోవ్వ ప్రతినిధి :మార్చి 28



నేడు గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడానికి తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించే చైతన్య యాత్రకు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యమ కళాకారులు, తెలంగాణ ఉద్యమ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలుపరిచే దిశగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ చైతన్య యాత్ర లాలాపేట ఉద్యమకారుల రాష్ట్ర కార్యాలయంలో నుండి మొదలై ఈసీఐఎల్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.

## మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

### ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నేత గుగులోతు బాలాజీ నాయక్



తొవ్వ, నెల్లికుదురు, మార్చి28

త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో వెనుకబడిన ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి ఎమ్మెల్యేగా ఉన్న గిరిజన బిడ్డ మానుకోట అభివృద్ధి ప్రదాత డాక్టర్ భూక్య మురళి నాయక్ కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నేత గుగులోతు బాలాజీ నాయక్ ఏఐసీసీ తోపాటు రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఎల్ హెచ్ పి ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ మండల నేతలు గుగులోతు బొజ్యా నాయక్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ మంగీలాల్ నాయక్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతంగా ఉన్న గిరిజన నియోజకవర్గమైన మహబూబాబాద్ అభివృద్ధి జరగాలంటే మురళి నాయక్ కు మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిందే అన్నారు. అంతేకాకుండా మహబూబాబాద్ పట్టణంలో రెండు దశాబ్దాలుగా వైద్య వృత్తిలో అనేకమందికి సేవలందించడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉంటూ మూడు దశాబ్దాలుగా పార్టీ క్రియాశీల రాజకీయాల్లో తనదైన ముద్రవేశారన్నారు. అంతేకాకుండా గడిచిన ఎన్నికల్లో 50 వేల పైచిలుకు మెజారిటీతో విజయం సొంతం చేసుకున్న మురళి నాయక్ ను మంత్రివర్గంలో చోటు కల్పిస్తే పార్టీ మరో మారు అధికారంలోకి రావడానికి విశేషమైన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మంత్రివర్గంలో సైతం లంబాడీలకు స్థానం కల్పించలేదని దీంతో ఆ ఖాళీ భర్తీ చేసినట్లు అవుతుందన్నారు. గత ప్రభుత్వం లో గిరిజన మహిళకు ప్రాధాన్యం ఇచ్చిందని అదే క్రమంలో మానుకోట ప్రాంతం నుంచి ఆయనకు చోటు కల్పించాలని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గూగుల్ శ్రీనివాస్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు గుగులోత్ వెంకన్న నాయక్, మాజీ పిఎస్ఎస్ డైరెక్టర్ లింగ్య నాయక్, కిషన్ నాయక్, సురేష్, మోహన్, తదితరులున్నారు.

## స్కావెంజర్ల, స్వీపర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

### స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఇ సంపల్లి సైదులు

తోవ్వ, నెల్లికుదురు, మార్చి 28



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్ల, స్వీపర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఈసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేము ప్రభుత్వ పాఠశాలలో గదులను, టాయిలెట్స్ వరిసరాలను శుభ్రపరుస్తున్నాము. కాని మాకు 6 నెలల నుండి జీతాలు రాక, బయట అప్పులు చేసి. కుటుంబాన్ని పోషించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. మమ్ములను నియమించేటప్పుడు నెల, నెలా జీతాలు వేస్తామని చెప్పడం జరిగినది. కాని పాఠశాలల ప్రారంభమైనప్పటి నుండి ఇంత వరకు జీతాలు రాలేదు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వార జీతాలు చెల్లిస్తామని చెప్పి నేటికి అమలు చేయ లేదు. నిత్యావసర సరుకుల ధరలను పెంచి కార్మికుల పై మోయలేని భారాన్ని మోపినాయని వాపోయారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వేతనాలు కాకుండా అందరికి ఒకే రకంగా జీతం 15,000/- రూ?లు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం మా యొక్క డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలని . డిమాండ్లను పరిష్కరించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు వెళ్తామన్నారు.ఈసమావేశంలో వెంకన్న, ఐలమ్మ, సితమ్మ, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి గూడెం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా గజ్జి అశోక్ యాదవ్



తొవ్వ, నెల్లికుదురు, మార్చి 27

మండలంలోని ఎర్రబెల్లి గూడెం టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త గజ్జి అశోక్ యాదవ్ ను నియామకం చేసినట్లు మండల అధ్యక్షులు పరిపాటి వెంకటరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు బత్తిని అనిల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు పరిపాటి వెంకటరెడ్డి గ్రామ అధ్యక్షులతోపాటు మండల ఉపాధ్యక్షులుగా గడ్డల రాముతో పాటు సోషల్ మీడియా కన్వీనర్ గా గుండెబోయిన సంతోష్ లను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అందుకే వారికి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టత కోసం తమ వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్షులు గజ్జి అశోక్ తో పాటు వారు తెలిపారు. పదవులు రావడానికి కృషి చేసిన గ్రామ ఎంపీటీసీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బత్తిని అనిల్ గౌడ్ తోపాటు తనకు పదవినిచ్చిన మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తో పాటు పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మండల ప్రచార కార్యదర్శి గాదేగంగా మదర్, పటాన్ శాఖ అధ్యక్షులు ఆదిరెడ్డి తదితరులున్నారు.

## జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులలో ముస్లిం నిరసన



తొవ్వ ,మహబూబాబాద్ ,మార్చ్ 28:

మహబూబాద్ జిల్లావ్యాప్తంగా అన్ని మసీదులలో ముస్లింలందరూ నల్ల బ్యాండ్ ధరించి శుక్రవారం నిరసన కార్యక్రమం శాంతియుతంగా తెలిపారు . ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్లా బోర్డు(%జూ×వీూదీ%) పిలుపుమేరకువర్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా ముస్లింలందరూ శాంతియుత నిరసన చేపట్టారు జుముఅతుల్-విదా రోజున (రంజాన్ నెలలో చివరి శుక్రవారం) మసీదులకు వచ్చేటప్పుడు ప్రతి ముస్లిం ఇంటి నుంచి నల్ల బ్యాచ్ చేతికి కట్టుకొని వచ్చి నమాజ్ చదివి నిరసన కార్యక్రమం శాంతియుతంగా తెలిపారు సుమారు 800 మంది ఈ నిరసన కార్యక్రమంలో చేపట్టారు ఢిల్లీ, పట్నాలో ఇప్పటికే నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ఈనేల 29న విజయవాడలో నిరసనకు దిగనున్నట్లు మతసంఘ పెద్దలు తెలిపారు

## మహబూబాబాద్ లో ఏప్రిల్ 11న జార్జిరెడ్డి సంస్మరణ సభ

### -పి.డి.ఎస్.యు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల గౌతం



తొవ్వ ,మహబూబాబాద్ ,మార్చ్ 28:

పి.డి.ఎస్.యు. వ్యవస్థాపకులు, ఉస్మానియా యూనివర్సిటీ అరుణతార కామ్రేడ్ జార్జి రెడ్డి సంస్మరణ సభను ఏప్రిల్ 11న మహబూబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పి.డి.ఎస్.యు. మహబూబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల గౌతం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా బొట్ల గౌతం మాట్లాడుతూ జీనా హై తో మర్నాసికో - కదం కదం ఫర్ లడ్ నా సీకో అంటూ ఆశేష విద్యార్థి లోకాన్ని చైతన్యవంతం చేసి, విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి కామ్రేడ్ జార్జి రెడ్డి తుదికంఠ పరితపించాడని తెలిపారు.శాస్త్రీయ విద్య సాధన , విద్యార్థుల హక్కులు, సమానత్వ సమాజ స్థాపనే ధ్యేయంగా పోరాడుతూ 1972 ఏప్రిల్ 14న ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, సంఘ్ పరివార్ మతోన్మాద శక్తుల భౌతిక దాడికి కామ్రేడ్ జార్జి రెడ్డి అమరుడయ్యాడని గుర్తు చేశారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మనువాద రాజ్య స్థాపనే ధ్యేయంగా, విద్య కాషాయీకరణే లక్ష్యంగా విద్య రంగంలో సంస్కరణలు తీసుకువస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేటి విద్యార్థి, యువత కుల,మత, ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపనే ధ్యేయంగా జార్జిరెడ్డి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశం




యాదాద్రి జిల్లా :వలిగొండ: తోవ్వ ప్రతినిధి :మార్చి 28

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశం శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఈ సన్నాహక కార్యక్రమం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా భీమా నాయక్ పాల్గొని మాట్లాడుతూ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. రాజ్యాంగ రచయిత అంబేద్కర్ పై, స్వాతంత్ర్య ఉద్యమం రథసారథి మహాత్మా గాంధీపై నీచంగా వ్యాఖ్యలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజలు ఉమ్మడిగా మరో సత్యాగ్రహాన్ని చేయాలని రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునివ్వడంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచనల మేరకు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడతామని నాయకులు, కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గరిసే రవి పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య మాజీ సర్పంచ్ పబ్బు ఉపేందర్ బోస్, మాజీ ఎంపీటీసీలు పలుసం సతీష్ గౌడ్ రేఖల ప్రభాకర్ గాడిపెల్లి యాదయ్య చిలుగూరి సత్తిరెడ్డి జక్క జంగారెడ్డి ఉక్కుర్తి స్వామి ఓబిసెఎల్ మండల అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి ,మామిడి సత్తిరెడ్డి, జంగం శంకరయ్య కాసుల వెంకన్న ,కొండూరు సాయి, బత్తిని సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాద శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని వరుణ్ గౌడ్, మేర సంఘం మండల అధ్యక్షులు ఆదిమూలం సోమేశ్ ,యూత్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఎదురుగట్ల బాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుంది

**పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ నాయకులందరికీ తగిన ప్రాధాన్యత కల్పిస్తాం**

**సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలకు కాంగ్రెస్ నాయకులు దీటుగా జవాబు ఇవ్వాలి**

**కార్యకర్తల దిశానిర్దేశంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాంజేందర్ రెడ్డి**

తొవ్వ ,పాలకుర్తి ,మార్చ్ 28:



సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుంది పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ నాయకులందరికీ తగిన ప్రాధాన్యత కల్పిస్తాం సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలకు కాంగ్రెస్ నాయకులు దీటుగా జవాబు ఇవ్వాలని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాంజేందర్ రెడ్డి అన్నారు ,శుక్రవారం పెద్ద వంగర మండల కేంద్రంలోనీ శ్రీ సాయి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ గ్రామ కోఆర్డినేటర్ల పరిచయ వేదిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని,పార్టీ భవిష్యత్తు కార్యచరణ పై నాయకులకు దిశా నిర్దేశం చేశారు ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ మాట్లాడుతూ.. నాడు బిఆర్ఎస్ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలు సోషల్ మీడియా నాయకులే అనీ వారి త్యాగాలతో వారి కృషితో కాంగ్రెస్ పార్టీ అధికారం అధికారంలోకి వచ్చిందనీ అన్నారు, పార్టీ నాయకులకు ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని తెలిపారు,మీమీ గ్రామాలలో ఉన్న సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు, రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని,పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తలకు, నాయకులకు పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు, సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి దిశలో పయనిస్తుందని, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని తెలిపారు, త్వరలో సమీపిస్తున్న ఎన్నికలలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పని చేసి పార్టీ బలోపేతానికి, పల్లెల అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు ఆమ్యా నాయక్, మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకులు నెహ్రూ నాయక్, మండల కోఆర్డినెటర్లు గంజి విజయపల్ రెడ్డి, రెంటల గోవర్ధన్ రెడ్డి, వివిధ గ్రామల గ్రామ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల మహిళా అధ్యక్షురాలు, వివిధ గ్రామాల యువజన అధ్యక్షులు, వివిధ గ్రామాల సోషల్ మీడియా కోఆర్డినెటర్లు, ఏ ఎం సి డైరెక్టర్ లు, వివిధ అనుబంధ సంఘ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు..

## కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మోసాలు

తొవ్వ, కేసముద్రం, మార్చి 28:



కేసముద్ర వ్యవసాయ మార్కెట్లో మిర్చి కొనుగోళ్లలో నాసిరకం మిర్చి అంటగట్టాలని వ్యాపారిని మోసం చేయాలని ప్రయత్నించిన సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం వచ్చి టెండర్ పాట సమయంలో కార్లాయి గ్రామానికి చెందిన అనిల్ అనే రైతు 14 బస్తాల మిర్చి వ్యవసాయ మార్కెట్ కు తీసుకు రావడం జరిగింది. మార్కెట్ రికార్డులలో కార్లాయి గ్రామానికి చెందిన అనిల్ పేరు నమోదు చేయగా టెండర్ పూర్తి అయిన తర్వాత బయట రోడ్ల వెంట కొనుగోలు చేసేటువంటి ఒక వ్యాపారి ఆ రైతు సరుకును వేరే ఒక వాహనంలో తీసుకెళ్లి బయట కొనుగోలు చేసి వేరే నాసిరకం మిర్చి బస్తాలను మరియొక వాహనంలో తిరిగి అదే రైతు పేరు మీద వేరేచోట బస్తాలను దిగుమతి చేసి అదే రైతు పేరుపై విక్రయించాలని ప్రయత్నించిన బయట వ్యాపారి, సాయి శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీ గుమస్తా అనుమానంతో సరుకును పరిశీలించగా బస్తాలను మార్చి వేరే నాసిరకం సరుకులు తీసుకొచ్చినట్టుగా గుర్తించిన సదరు గుమస్తా వెంటనే వ్యాపారికి విషయం తెలియజేయడంతో ట్రేడింగ్ కంపెనీ యొక్క వ్యాపారి మార్కెట్ అధికారులకు సమాచారం ఇవ్వగా మార్కెట్ అధికారులతో సరుకులు పరిశీలించి బస్తాలను మార్చినట్టుగా గుర్తించడం జరిగిందని మార్కెట్ అధికారులు వ్యాపారి తెలిపారు. వ్యాపారిని మోసం చేయాలని ప్రయత్నించిన బయట వ్యాపారి సర్కుపై అధికారులు పూర్తిగా పరిశీలించాల్సి ఉంటుందని ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా చూస్తామని మార్కెట్ ప్రత్యేక కార్యదర్శి అమరలింగేశ్వరరావు తెలిపారు.

## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్ కి వినతి

తొవ్వ కేసముద్రం మార్చి 28:



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసిన కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారుల పురం ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసిల్దార్ తల్లూరి దామోదర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు చాగంటి కిషన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి సత్కరించాలని అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి రూపాయలు 10 లక్షల పరిహారం అందజేయాలని ప్రభుత్వం ద్వారా గుర్తించిన ఉద్యమకారులకు మండల కేంద్రంలో 250 చదరపు గజాల నివాస స్థలం కేటాయించి డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని నెలకు రూ.25 వేల పెన్షన్ అర్హత గల ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వ ధ్రువీకరణ పత్రం గుర్తింపు కార్డులు అందించి రాజీవ్ యువశక్తి స్కీమ్ లో ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ ,విద్యార్థి యువజన జేఏసీ పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, చిట్యాల వీరన్న, మోడెం రవీందర్ గౌడ్ ,దార్ల రామ్మూర్తి ,శివారపు శ్రీధర్, వేల్పుల రేవంత్, బాలుమోహన్, వేం నర్సింహారెడ్డి ,జనిగల పరమేశ్వర్ , వంగాల అశోక్ ,షేక్ ఇమామ్, గాడిపెల్లి వెంకట్, ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్

తొవ్వ ,ఆదిలాబాద్,మార్చ్ 28:



రాష్ట్ర ప్రభుత్వం యువత అభివృద్ధి సంక్షేమం ఆర్థిక స్థావలంబన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్ పిలుపునిచ్చారు శుక్రవారం అయన ఓ ప్రకటన ద్వారా తెలియజేస్తూ రాజీవ్ యువ వికాస పథకంలో ఉండే ఉపయోగాలు నిరుద్యోగ యువత ఆర్థిక స్వాలంభ లక్ష్యాలను తెలిపారు ప్రతి నిరుద్యోగి ఈ పథకం ఉపయోగించుకోవాలన్నారు . ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యువతి యువకులు స్వయం ఉపాధి కల్పించాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని అన్నారు. యువకులు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అవకాశం కలుగుతుందన్నారు

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు — జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు — మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

శుక్రవారం 28 మార్చి 2025 — పేజీలు 2


## క్యాన్సర్ వ్యక్తికి ఆదివాసి ట్రస్ట్ చేయూత

**అల్లూరి జిల్లా చింతపల్లి. తొవ్వ ప్రతినిధి. ( ప్రశాంత్ ) మార్చి 28** : చింతపల్లి పంచాయితీ లో అంతర్ల గ్రామానికి చెందిన కవడం సోమలింగం ఈయన గత కొంతకాలం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతు ఉన్నారు. ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ కె బి పడాల్ ని కుటుంబ సభ్యులు కలవగా ఈయన పరిస్థితిని తెలుసుకున్నటువంటి ట్రస్ట్ చైర్మన్ తక్షణమే మెరుగైన వైద్యం కోసం కవడం సోమలింగం విశాఖపట్నం కార్పొరేట్ ఆసుపత్రి పంపించడం జరిగింది.



# సన్నబియ్యం సప్లైతోనైనా...

# అక్రమ దందా ఆగేనా ?



### షీట్లు, పిడియాక్ట్ లు నమోదు.... అయినా ఆగని పిడిఎస్ దందా...!

### కొత్తదారుల్లో బియ్యం తరలిస్తున్న అక్రమార్కులు




**మిర్యాలగూడ, మార్చి 28:** ప్రజాపంపిణీ (పిడి ఎస్ )బియ్యం. సామాన్యుల ఆకలి తీర్చడ మేమో గానీ అక్రమ వ్యాపా రులకు, అంటకాగే అధికా రులకు కాసులు వర్షం కురి పిస్తూ అనతి కాలం లోనే లక్షధికారులను చేస్తున్న అక్షయ పాత్ర అయ్యింది అనడం లో అతిశయోక్తి లేదు. ఎగబడి కార్డుల పై బియ్యం తెచ్చుకున్న లబ్ధిదారుల్లో ఎక్కువ మంది బ్లాక్ మార్కెట్ దందా దళారులకు విక్రాయిస్తున్నారు. అలావెళ్ళి... చేతులు మారుతూ.... కాసులు నింపుతూ తిరిగి మిల్లులకు... ఆపై లేవికింద ప్రభుత్వ గోడౌన్ లకు చేరుతున్నాయి పిడిఎస్ బియ్యం. ఇప్పుడు ప్రభుత్వం ప్రజలకు సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పి డి ఎస్ బియ్యం వినియోగం లోకి వచ్చి, అక్రమ దందా కు చెక్ పడుతుందాఅనేది త్వరలో తేలనుంది. పేదలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం దాదాపు 40 రూపాయలు వెచ్చించి రైతులు, మిల్లర్స్ వద్ద కొనుగోలు చేసి ఉచితంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. మామూలు బియ్యాన్ని బలవర్ధకమైన ఆహారంగా మార్చేందుకు మినరల్స్ యాడ్ చేసి పోర్టీఫైడ్ బియ్యాన్నిఅందజేస్తున్నప్పటికీ, దీనిపై ప్రజలకు సరైన అవగాహన లేక ఎనిమిది రూపాయలకు అక్రమ దందా దళారులకు విక్రయిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యంగా పల్నాడు జిల్లాకు చెందిన కొందరు అక్రమ దందా రాయుళ్లు తెలంగాణ సరిహద్దు గ్రామాలలో పెద్ద ఎత్తున దళారులను ఏర్పాటు చేసుకొని ఏళ్ల తరబడి అక్రమ దందాను నిరంతరా యంగా కొనసాగిస్తున్నారు.

# దక్షిణ భారతదేశం కు అన్యాయం ..!

### ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్

**కరీంనగర్ మార్చి 28**

దక్షిణ భారతదేశానికి అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్‌డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ లో ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి దక్షిణాదిపై దాడి అని ప్రస్తావించడం జరిగిందన్నారు. వారం రోజుల క్రితం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాల సీఎంలు, నాయకులతో చెన్నైలో ఒక సమావేశం ను ఏర్పాటు చేయడం జరిగింది.కేంద్ర ప్రభుత్వం గత కొద్ది రోజుల నుండి డీలిమిటేషన్, పార్లమెంటు నియోజకవర్గల పునర్ విభజన కార్యక్రమం పై పార్లమెంటులో చర్చ ప్రారంభించడం వలన దక్షిణ భారతదేశముకు అన్యాయం జరుగుతుందని చర్చ ప్రారంభమైందన్నారు. అసలు ముందు దక్షిణ భారతదేశమంటే ఎక్కడి నుండి ఎక్కడి వరకు అనేది నిర్ధారణ జరగాలన్నారు. చారిత్రిక, భౌగోళిక అంశాలను పరిశీలన చేస్తే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వింధ్య పర్వతాల దిగువ నుండి హిందూ మహాసముద్రం వరకు విస్తరించి ఉన్న భూభాగాన్ని దక్షిణ భారతదేశంగా పరిగణించేవారన్నారు. అంటే ఇప్పుడు మనం అనుకుంటున్న ఐదు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లోని కొంత ప్రాంతం చత్తీస్గడ్, ఒరిస్సా రాష్ట్రాలలోని 70% భూభాగాన్ని దక్షిణ భారతదేశంగా పరిగణించాల్సి వస్తుందన్నారు. కావున ఈ సబ్జెక్టు ( దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుంది) పై మాట్లాడే మేధావులు రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు పైన ఉదహరించిన ప్రాంతాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లు భవిష్యత్తులో జరుగు సమావేశాలకు పైన ఉదాహరించిన ప్రాంతాల వారిని సమావేశాలకు ఆహ్వానించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ గారు కూడా తాను రచించిన స్టేట్స్ అండ్ మైనార్టీస్ అనే గ్రంథంలో దక్షిణ భారతదేశంపై ఉత్తరాది పెత్తనం భవిష్యత్తులో ఉండకూడదని అంశంపై పలు సూచనలు అప్పుడే చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ చివరలో హైదరాబాదులో దక్షిణ భారతదేశం అంటే అనే అంశంపై ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సెమినార్ ను ఏర్పాటు చేస్తామని కొరివి వేణుగోపాల్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో శ్రీరాముల కిషన్, తాళ్ల వెంకటేష్ ,సిగిరి శ్రీధర్ ,నల్లల శ్రీనివాస్ లు పాల్గొన్నారు



# కోటి రూపాయల పైనే విలువైన గంజాయి దహనం



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల ఇరవై తొమ్మిది వేల నాలుగు వందల రూపాయలు (1,28,29,400/-) విలువైన 513 కేజీ 176 గ్రాముల గంజాయి ని మహబూబాబాద్ జిల్లా పోలీసులు ధ్వంసం చేశారు.కాకతీయ మెడిక్లీన్ ఏజెన్సీ, ఊర్సుగుట్ట, హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, మాధకద్రవ్యాల నిరోధక శాఖ ఆదేశాలమేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యుల సమక్షంలో గంజాయిదహనం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్పీ గంద్రతి మోహన్, మహబూబాబాద్ టౌన్ డిఎస్పీ తిరుపతి రావు, డిసిఆర్బి ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ, గూడూరు సీఐ సూర్యప్రకాష్, మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్, మరిపెడ సీఐ రాజకుమార్ అధికారులు పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా పోలీసులు గత కొంతకాలంగా చేపట్టిన విస్తృత తనిఖీల్లో పట్టుబడి 9 కేసులలో స్వాధీనం చేసుకున్న గంజాయిని జిల్లా మద్దకద్వావ్యాల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... మహబూబాబాద్ జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని,యువతను డ్రగ్స్ మాయలోకి దూరనీయకుండా అవగాహన కార్యక్రమాలు, కఠినమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం గురించి సమాచారం అందిస్తే ఆ వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

### - కాంగ్రెస్ జిల్లా యువ నేత ఆకుతోట సతీష్ - నెల్లికుదురు లో ముస్లింలకు ఇఫ్తార్ విందు

**తొవ్వ, నెల్లికుదురు, మార్చి 28**



మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగ రంజాన్ అని యువజన కాంగ్రెస్ జిల్లా నేత ఆకుతోట సతీష్ అన్నారు. శు క్రవారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఈద్గాలో ముస్లింలకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మద్ది రాజేష్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన భారతదేశ సంస్కృతి అని సాంస్కృతిని సాంప్రదాయాలను గౌరవించే భారతీయులు ముస్లిం సోదరులను గౌరవించుకోవడం సాంప్రదాయమన్నారు అందులో భాగంగానే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. అల్లా దయవల్ల స్థానిక శాసనసభ్యులు మురళి నాయక్ కు మంత్రి పదవి రావాలని ఆ భగవంతుని వేడుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుంట్ల మౌనేందర్, పి ఎస్ ఎస్ డైరెక్టర్ రావుల సతీష్, కాంగ్రెస్ యువ నేత వెన్నం క్రాంతి రెడ్డి, ముస్లిం పెద్దలు ఎండి రెహమాన్, అఫ్రోజ్, అజ్గర్, ఆఫ్రిద్, షకీల్ అబ్బుల్, యాదవ సంఘం అధ్యక్షులు బొల్లు లింగమూర్తి యాదవ్ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## కూతురిని ప్రేమిస్తున్నాడని నరికి చంపాడు !

### పుట్టిన రోజునాడే యువకుడి దారుణ హత్య

### పోలీసుల అదుపులో యువతి తండ్రి



తొవ్వ,ప్రతినిధి మార్చి 28:

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కూతురిని వేరే కులం యువకుడు ప్రేమి స్తున్నాడని యువతి తండ్రి గొడ్డలితో నరికి చంపాడు.వివరాల్లోకి వెళితే ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల సాయికుమార్, అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారిద్దరి కులాలు వేరు కావడంతో వారి ప్రేమకు యువతి తండ్రి అడ్డు చెప్పాడు. ఇకపై తన కూతురితో మాట్లాడొద్దని సాయికుమార్ ను హెచ్చరించాడు.అయినా వారు మాట్లాడుతూ నీవుండటం తో దీంతో యువతి తండ్రి ఆగ్రహంతో రగిలిపోయాడు. క్రమంలో గ్రామంలోని వేంక టేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి సాయికు మార్ తన స్నేహితులతో ఉండగా యువతి తండ్రి గొడ్డలితో అక్కడికి వెళ్లాడు. సాయి కుమార్ను విచక్షణారహితంగా నరికాడు. కుమార్ను విచక్షణారహితంగా నరికాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని స్నేహితులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అయితే పుట్టిన రోజునాడే తమ కొడుకు మృతిచెందడంతో సాయికుమార్కు టుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సదయ్యను అర్ధరాత్రి పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. యువతి కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

## శక్తి యాప్ తో మహిళలకు రక్షణ

### చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు

### కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి

**అల్లూరి జిల్లా చింతపల్లి.**

**తొవ్వ ప్రతినిధి. ( ప్రశాంత్ ) మార్చి 28 :**



చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ వి వెంకటేశ్వరరావు కళాశాల ఆవరణలో దిశ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రతి మహిళ మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ ఉండాలని విద్యార్థులతో మొబైల్లో శక్తియాప్ ఇన్ స్టాల్ చేయించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఈ యాప్ అందుబాటులో తీసుకొచ్చిందని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటే పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని అన్నారు మహిళలకు ఆపద సమయంలో సమాచారం పోలీసులకు శక్తి బంధాలు అప్రమత్తమై సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని సహచరులు అందిస్తున్నారు. శక్తియాప్ కలిగిన మహిళలు ఆపద సమయంలో సింగిల్ టచ్ ద్వారా శక్తి బృందానికి సమాచారం పంపవచ్చును అన్నారు మహిళా ఒక్క ప్రాంతంలో నుంచి మరో ప్రాంతానికి ప్రయాణం ఎప్పుడు ఆమె గమ్యస్థానం చేరుకునే వరకు లైవ్ ట్రాక్ ఉంటుందన్నారు ఆపద సంభవిస్తే ఆడియో వీడియో కంట్రోల్ రూమ్ కి చేరుతుందని వెంటనే శక్తి బృందం స్పందిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై ఈ వెంకటేశ్వరరావు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

## రంజాన్ మాసం పవిత్రతకు, సహనానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

### పాలకుర్తిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొవ్వ, ప్రతినిధి, మార్చ్ 28

రంజాన్ మాసం పవిత్రతకు, సహనానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అన్నారు.పాలకుర్తి మండల కేంద్రంలోని బాషరత్ ఫంక్షన్ హాల్లో ముస్లిం సోదరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో %శ్రీ% ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం లో. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలతో తమ ఆత్మశుద్ధిని పెంపొందించుకుంటారని అలాంటి మాసాన్నిప్రత్యేకంగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలు పాల్గొనడం అదృష్టంగా భావించా న్నారు. రంజాన్ సామాజిక ఐక్యతకు మార్గం వేస్తున్నాయన్నారు. మతాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి, ఒకటిగా ఉండే దిశగా ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి" అని తెలిపారు..అలాగే, రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.. ప్రజల సమస్యలు పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ముఖ్యంగా మైనారిటీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అవగాహన కల్పిస్తూ, అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు..కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, మతపెద్దలు, తదితరులు, పాల్గొన్నారు..

## వైయస్సార్సీపి మండల నూతనఅధ్యక్షుడిగా పాంగి గణబాబు

అల్లూరి జిల్లా చింతపల్లి, తొవ్వ ప్రతినిధి. ( ప్రశాంత్ ) మార్చి 28 :



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చింతపల్లి నూతన మండల అధ్యక్షుడిగా పాంగి గణబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జిల్లా అధ్యక్షులు, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన గణబాబు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, అలాగే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు పోరాటం చేస్తానని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనను ఎండగడుతూ, వారి వైఫల్యాలను నిష్పక్షపాతంగా బయటపెడతానని స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిని చైతన్యవంతులను చేస్తానని తెలిపారు. ప్రజల కష్టాలను తీర్చేందుకు, కూటమి ప్రభుత్వ తీరును బహిర్గతం చేసి, వైకాపాను బలపరిచేందుకు నా శక్తిమేర కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గణబాబుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు ప్రముఖ నాయకులు పాల్గొని, ఆయనకు తమ మద్దతును ప్రకటించారు.